

జీరో బిల్ రాని వారు దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డి, ఆగస్టు 21: విద్యుత్ వినియోగదారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఆన్‌లైన్‌లో గృహ జ్యోతి నాన్ అప్ లోడ్ అని వచ్చిన వారు జీరో బిల్ గురించి దరఖాస్తు చేసుకోవాలని ఎల్లారెడ్డి విద్యుత్ ఏఈ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆప్షన్ ఇచ్చిందని, అందుకు వినియోగదారులు, గ్రామ పంచాయతీ వారు మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపల్ పరిధిలో ఉన్న వినియోగదారులు మున్సిపల్ కార్యాలయంలో జీరో బిల్ కోసం రేషన్ కార్డు ప్రజా పాలన రశీదు, కరెంట్ బిల్లు, ఫోన్ నెంబరుతో సంప్రదించాలని తెలిపారు.

రైతన్నకు.. భరోసా



● బిచ్కుందలో రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు



- జిల్లాలో రుణమాఫీ కాని రైతుల వివరాల కోసం స్పెషల్ డ్రైవ్
- గ్రామాల్లో పది రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- ఇప్పటికే ఫిర్యాదుల స్వీకరణకు మండలాల వారీగా అధికారుల నియామకం
- రుణమాఫీ ఫిర్యాదుల సెల్‌కు 8,600 అర్జీలు
- వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- మూడు విడతల్లో 91,899 మంది రైతులకు రుణమాఫీ
- జిల్లావ్యాప్తంగా రుణమాఫీ కానీ రైతులు మరో 50 వేల మంది : రైతు సంఘాలు

కామారెడ్డి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మూడు విడుతల్లో పంట రుణాల మాఫీ చేసిన విషయం తెలిసిందే. అయితే చాలామందే అర్హులైన రైతులకు రుణాలు మాఫీ కాకపోవడంతో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పంటరుణాలు మాఫీకాని రైతులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అర్హులైన రైతులు ఉండి రుణాలు మాఫీ కానీ రైతుల వివరాలు నమోదు చేసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ రుణ మాఫీ రైతుల వివరాలు తెలుసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతుంది. ఇప్పటికే 25 మండలాల్లో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు నోడల్ అధికారులను ఏర్పాటు చేసింది. రుణమాఫీ కానీ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా నెలరోజుల్లో 8,600 ఫిర్యాదులు వచ్చినట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.

మూడు విడుతల్లో రుణమాఫీ

రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల పాటుగా మూడు విడుతల్లో రైతుల పంట రుణాల మాఫీ చేపట్టింది. జిల్లాలో 91,899 మంది రైతులకు రుణమాఫీ చేయగా.. రూ.655.37 కోట్ల నిధులను విడుదల చేసింది. మొదటి విడతలో 49,540 మంది రైతులకు మాఫీ చేయగా.. రూ.231.13కోట్లు విడుదల చేసింది. రెండో విడతలో 24,816 మంది రైతులకు మాఫీ చేయగా.. రూ.211.72 కోట్ల నిధులను, మూడో విడతలో 17,543 మంది రైతులకు మాఫీ చేయగా.. రూ.212.52కోట్ల నిధులను విడుదల చేసింది. అయితే జిల్లా వ్యాప్తంగా పంటల రుణమాఫీకి సుమారు 1.50 లక్షల మంది రైతులు అర్హులుగా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతల్లో రుణమాఫీ చేయడంతో 91,899 మంది రైతులకు మాఫీ జరిగింది. ఈ లెక్కన జిల్లాలో మరో 50వేల మందికి పైగా రైతులు రుణ మాఫీకి అర్హులుగా ఉన్నట్లు అధికార వర్గాలు, రైతు సంఘాలు తెలుపుతున్నాయి. వివిధ సాంకేతిక కారణాల వల్ల వీరందరికి మాఫీ కాలేదని జాబితాలో పేర్లు రాలేకపోయాయని సంబంధిత శాఖల అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రైతుల కోసం స్పెషల్ డ్రైవ్

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతురుణమాఫీకి శ్రీకారం చుట్టింది. మూడు విడుతల్లో నెలరోజుల పాటు రైతులకు రుణమాఫీ చేసింది. అయితే కొందరు రైతులు రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వారికి శుభవార్త అందించింది. అర్హత ఉన్న రుణమాఫీ కాని రైతుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఆధార్‌లో తప్పులు ఉంటే.. దానికి బదులుగా ఓటర్ లేదా రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. రేషన్‌కార్డు లేకపోతే రైతుల కుటుంబాల వివరాలు సేకరించేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. బ్యాంక్ ఖాతాలో వ్యత్యాసాలను సరి చేయడానికి ఆధార్, పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. అస లు, వడ్డీ లెక్కలు సరిపోకపోతే ఇంటికి వెళ్లి ఫిర్యాదులను స్వీకరించనున్నారు.

పది రోజుల పాటు ఫిర్యాదుల స్వీకరణ

రుణమాఫీ కాని రైతుల కోసం పది రోజుల పాటు అధికారులు ఆయా మండలకేంద్రాల్లోని రైతువేదికల్లో ఫిర్యాదులు స్వీకరించనున్నారు. మండల కేంద్రాలలోని రైతు వేదికలు, వ్యవసాయశాఖ కార్యాలయాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఫిర్యాదుల స్వీకరణకు జిల్లాలో 25 మండలాల్లో ఇప్పటికే నోడల్ అధికారులను నియమించింది. ఏవోలు లేనిచోట ఏఈవోలను నియమించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాల్లో ఉన్న అన్ని బ్యాంకు శాఖలో పీఏసీఎస్‌లకు నోడల్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. రుణమాఫీ కానీ రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ స్టేట్‌మెంట్, కుటుంబ నిర్ధారణ కోసం రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను అందించాలి. ఆధార్ కార్డు లేకపోతే గుర్తింపు కార్డు తీసుకు వెళ్లి నోడల్ అధికారులను సంప్రదించవచ్చు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు

బ్యాంకర్ల వల్ల జరిగిన తప్పిదాలు కుటుంబ నిర్ధారణ కానివి, మిస్సింగ్ డాటా, తదితర సమస్యలపై స్పెషల్ డ్రైవ్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చని సంబంధితశాఖ అధికారులు తెలిపారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరించి అధికారులు క్రాప్‌లోన్ వివర్స్ పోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులు సుమారు 8,600 మంది రైతులు ఫిర్యాదు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.



● రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

సంక్షిప్త సమాచారం



బ్రోచర్ విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి

చర్చా వేదిక బ్రోచర్ విడుదల

దోమకొండ, ఆగస్టు 21: బిక్కనూర్ తెలంగాణ విశ్వ విద్యాలయం దక్షిణ ప్రాంగణం, దోమకొండ గడికోట, తెలంగాణ ప్రభుత్వం యొక్క భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న (తెలంగాణ యొక్క చరిత్ర, వారసత్వం) అనే అంశాలపై చర్చ వేదిక 24న శనివారం దోమకొండ గడికోటలో నిర్వహించడం జరుగుతుందని అందుకు సంబంధించి బ్రోచర్‌లను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి విడుదల చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సుధాకర్‌గౌడ్, అంజయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఫలితాలు విడుదల

ఎల్లారెడ్డి, ఆగస్టు 21: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలలో మొత్తం ఎనిమిది రేషన్ డీలర్లకు రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించిన అనంతరం ఫలితాలను వెల్లడించినట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల జాబితా ఆర్డీవో కార్యాలయంలో ఉందని పేర్కొన్నారు.

నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే రాక

ఎల్లారెడ్డి, ఆగస్టు 21: గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సోమార్‌పేట్ బైపాస్ వద్ద నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పరిశీలించినట్లు క్యాంపు కార్యాలయం సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పేర్కొన్నారు.

సాఠే జయంతి వేడుకల్లో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే

మద్నూర్, ఆగస్టు 21: మద్నూర్ మండలంలోని తడిహిప్పర్గా, దన్నూర్ గ్రామాలలో సాహిత్యరత్న, లోక శాహిర్ అన్నా బాహు సాఠే 104వ జయంతి వేడుకలలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా బావు సాఠే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్, నాయకులు హన్మాండ్లు, స్వామి, బండి హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.



అన్నాబాహు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే

గంగమ్మ వాగు వద్ద నిర్మాణ పనులు

15 రోజుల్లో పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ● రామారెడ్డి గ్రామ శివారులో కల్వర్టు పనుల పరిశీలన ● కేజీబీవీతో పాటు వసతి గృహం సందర్శన



కేజీబీవీ వసతి గృహంలో టాయిలెట్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్



బస్సు ప్రమాదంపై డ్రైవర్‌ను ఆరా తీస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 21: గంగమ్మ వాగు వద్ద కల్వర్టు నిర్మాణ పనులను 15రోజుల్లో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం రామారెడ్డి గ్రామ శివారులోని గంగమ్మవాగు వద్ద కల్వర్టు పనులను పరిశీలించారు. కల్వర్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, డీఈ శ్రీనివాస్, ఏఈ రవితేజను ఆదేశించారు. కేజీబీవీ వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. కేజీబీవీలో చేపట్టిన మరమ్మతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంట గది, మరుగుదొడ్లు, పరిసరాలు పరిశీలించారు. వసతిగృహ మైదానంలో పిచ్చిమొక్కలు ఉండడంతో వాటిని తక్షణమే తొలగించాలని అధికారులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడేళ్లుగా పదో తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని మండలవిద్యాధికారియోసఫ్, వసతిగృహం ప్రత్యేకాధికారి వనిత తెలిపారు. అనంతరం రామారెడ్డి పీహెచ్‌సీని సందర్శించి ఆసుపత్రిలోరోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు, కాళ్లనొప్పులు ఉన్నాయని రోగులు వివరించారు. ఆసుపత్రిలో ఉన్న ఇన్‌వార్డు, ప్రసవ గదులు పరిశీలించారు. అనంతరం ఇసన్నపల్లిలోని పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. నడకదారిలో వెళ్లి వనంలో ఉన్న చెట్లను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్,అడిషనల్ పీడీ వామన్‌రావు, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సువర్ణ, ఏఈవో ధర్మారెడ్డి, కార్యదర్శులు క్రాంతి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

● ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదంపై ఆరా

కామారెడ్డి టౌన్: రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామం నుంచి కామారెడ్డి ఆర్టీసీ డిపోకు వస్తున్న బస్సు మార్గమధ్యలో ప్రమాదానికి గురైంది. బస్సు ప్రయాణిస్తున్న సమయంలో స్టీరింగ్ రాడ్ ఒక్కసారిగా విరిగిపోవడంతో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును రోడ్డు కిందకు వెళ్లగా నిలువరించాడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. అయితే రామారెడ్డి మండల పర్యటన ముగించుకుని తిరిగి కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ డ్రైవర్‌ను అడిగితెలుసుకున్నారు.ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడంతో మరో బస్సులో ప్రయాణికులను పంపించేలాఏర్పాట్లు చేయాలని సూచించారు.

పట్టాపాస్ పుస్తకం ఆధారంగానే రుణమాఫీ చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు (ఇన్‌సెట్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం)



కామారెడ్డి టౌన్, ఆగస్టు 21: పట్టాపాస్ పుస్తకం ఆధారంగానే రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో రైతులు జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాల నుంచి పాత బస్టాండ్, రామారెడ్డిరోడ్డు గుండా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2లక్షల వరకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని అన్నారని ఇప్పుడేమో కొర్రీలు పెడుతూ రేషన్‌కార్డు ఆధారంగా రుణమాఫీ చేస్తామని చెప్పి ఎంతో మంది రైతులకు రుణమాఫీ కాకుండా వ్యవహరించడం తగదని అన్నారు. బ్యాంకులలో పట్టాపాసుపుస్తకాల ఆధారంగానే రుణాలు అందిస్తారని రేషన్‌కార్డుల ద్వారా కాదని అన్నారు. ఈ రకంగా రుణమాఫీ పేరుతో మాయచేయడం ఎంతవరకు సబబు అని ప్రతీ గ్రామంలో సగానికి సగం మంది రైతుల రుణమాఫీ చేయలేదని అన్నారు. ప్రతీ రైతుకు రుణమాఫీచేయాలని లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. రైతులు పెద్దఎత్తున తరలిరావడంతో డీఎస్పీనాగేశ్వర్‌రావు ఆధ్వ ర్యంలో బందోబస్తు నిర్వహించి పలువురు రైతులను కలెక్టర్ వద్దకు తీసుకు వెళ్లడంతో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైతులు కలెక్టరేట్‌లో అందించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి వరప్రసాద్

జీజీహెచ్‌లో న్యాయచైతన్య సదస్సు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 21: జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో బుధవారం జీజీహెచ్‌లో న్యాయచైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి హజరైన జిల్లా న్యాయాధికారి వరప్రసాద్ వైద్యులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటన జరిగిన ముందుగా రిపోర్టుచేయాలని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో జరిగిన సంఘటనలో సుప్రింకోర్టు సుమోటోగా తీసుకోని టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. పనిచేసే ప్రదేశాలలో రక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంసింగ్‌కు సూచించారు. అలాంటి కమిటిలకు చట్టబద్దత ఉంటుందని అన్నారు. ఇందులో డిపూటీ సూపరింటెండెంట్ బన్సీలాల్, ఆర్ఎంవో యాదగిరి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, సాయిప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

రూ.7.5 లక్షల వ్యయంతో బ్రిడ్జి మరమ్మతులు ప్రారంభం : డీఈఈ

నాగిరెడ్డిపేట, ఆగస్టు 21 : మండల కేంద్రంలోని పోచారం ప్రధాన కాలువపై ఉన్న బ్రిడ్జి మరమ్మతు పనులను బుధవారం ఎల్లారెడ్డి ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. నాగిరెడ్డిపేట గ్రామంలో గల పోచారం ప్రధాన కాలువ పైన ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ఈ బ్రిడ్జి మరమ్మతుల పనుల కోసం 7.5 లక్షల రూపాయలు మంజూరు కాగా బ్రిడ్జి మరమ్మతు పనులు చేపడుతున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మరమ్మతు పనుల్లో భాగంగా బ్రిడ్జి స్లాబ్‌తో పాటు ఇరువైపులా గోడలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్ లక్ష్మణ్ ఠాగూర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయాగౌడ్, నాయకులు మన్నె వెంకట్, హన్మాండ్లు, విఠల్, బుర్రి సాయిగౌడ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించరూ..!

బాన్సువాడ టౌన్, ఆగస్టు 21: బకాయి వేతనాలు చెల్లించాలంటూ ఆస్పత్రి కార్మికులు బుధవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు మాట్లాడుతూ బాన్సువాడ ఏహెచ్, ఎసీహెచ్ ఆస్పత్రులలో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్, కార్మికులకు సంభందిత కాంట్రాక్టర్ నుంచి రావలసిన మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతీనెల క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని, శ్రమదోపిడీని అరికట్టాలని మండిపడ్డారు. అనంతరం ఆర్ఎంవో సూజాతకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, రేణుక, కమర్, సురేఖ, పండరి, నాగరాజు, సరోజ, సంగీత, కల్యాణి, మౌనిక, తదితరులున్నారు.



ఆస్పత్రి ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

మురికి కాలువలో బాలిక గల్లంతు

● గాలింపు చర్యలు చేపట్టిన డిజాస్టర్ సిబ్బంది


చిన్నారి అనన్య


గాలింపు చర్యలు చేపడుతున్న సిబ్బంది

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 21: నిజామాబాద్ నగరంలో ఓ మురికి కాలువలో రెండేళ్ల బాలిక గల్లంతైన ఘటన వెలుగులోకి వచ్చింది. నగరంలోని వర్నిరోడ్‌లోగల ఫారెస్టు శాఖ కార్యాలయం సమీపంలో ఉన్న ఆనంద్‌నగర్‌లో బాలిక అనన్య (2) ఆడుకుంటూ ఇంటిపక్కనే ఉన్న మురికి కాలువలో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. విషయం గమనించిన బాలిక తల్లి ఏడుపులు విని స్థానికులు అక్కడికి చేరుకొని విషయాన్ని పోలీసులకు, డిజాస్టర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మురికి కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం వర్నిరోడ్ ప్రాంతంలో భారీ వర్షం కురవగా కాలువలో నీటి ప్రవాహం పెరిగింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో బాలిక కాలువలో కొట్టుకుపోయింది. బాలిక ఆచూకి కోసం డిజాస్టర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టిన ఇంకా బాలిక ఆచూకి లభ్యం కాలేదు. బాలిక తండ్రి మారుతి సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తల్లి స్థానికంగా పలువురి ఇళ్లలో వంటపని చేస్తు జీవనం కొనసాగిస్తోంది. ఘటనా స్థలానికి పోలీసులతో పాటు మున్సిపల్ సిబ్బంది చేరుకొని ప్లాక్లెయినర్‌తో కాలువ నీటిని మళ్లిస్తూ బాలిక ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు.

నిజామాబాద్‌లో భద్రాచలం తలంబ్రాల పంపిణీ


తలంబ్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 21: నిజామాబాద్ నగరంలో భద్రాచలం సీతారామస్వామి తలంబ్రాలను పంపిణీ బుధవారం చేపట్టారు. గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్తసమాజం ధార్మిక సంస్థ వంద కిలోల తలంబ్రాలను పంపిణీ చేస్తున్నారు. నిజామాబాద్‌లోని కోట గల్లి హనుమాన్ మందిరంలో రెండు గంటల పాటు భక్తులచే రామస్మరణ చేయించి ఈ తలంబ్రాలను పంపిణీ చేశారు. సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఈ తలంబ్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు విష్ణు పంతులుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో బదిలీలకు షెడ్యూల్ విడుదల

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 21: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ, ఏఎన్‌ఎం, అకౌంటెంట్ల బదిలీలకు షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సమగ్ర శిక్షా తెలంగాణ ఆదేశాల మేరకు షెడ్యూల్ విడుదలైనట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బదిలీలు నిర్వహించనున్నారు. ఈనెల 22న బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కానుంది. 22, 23, 24 తేదీలలో ఆన్‌లైన్‌లో బదిలీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించనున్నారు. 25న కేటగిరిల వారిగా పాయింట్ల ప్రకారం జాబితాను ప్రకటించనున్నారు. 26న అభ్యంతరాల స్వీకరణ, 27న అభ్యంతరాల పరిశీలన, 29న తుది జాబితా ప్రకటన, 30, 31తేదీలలో అంతర్గత జిల్లా వారిగా వెబ్ ఆప్షన్ల వెసులుబాటు, సెప్టెంబర్ 1న మ్యానువల్ బదిలీలు, 2న ఇంటర్ డిస్ట్రిక్ట్ బదిలీలు, 3, 4 తేదీలలో ఇంటర్ డిస్ట్రిక్ట్ వెబ్ ఆలాట్‌మెంట్, 5న బదిలీ అయిన స్థానాల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లాలోని కెజిబివిలలో పనిచేస్తున్న సిబ్బంది కేటగిరిల వారిగా బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

సీనియర్ సిటిజన్ల పాత్ర చాలా గొప్పది



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న లాయన్ నివేదన గుజరాతీ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు21: అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సుమారు 13 సీనియర్ సిటిజన్ ఫోరం గౌరవ సభ్యులకు జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేసిన జీజీ ఫౌండేషన్ వ్యవస్థపక అధ్యక్షులు లాయన్ నివేదన గుజరాతీ ఎంజేఎఫ్ అనంతరం ఫోరం అధ్యక్షులు దొండి నారాయణవర్మ మాట్లాడుతూ నేటి సమాజంలో సమాజ అభివృద్ధి కొరకు సీనియర్ సిటిజన్ పాత్ర చాలా పెద్ద ఎత్తున ఉంటుందని వారి అమూల్యమైన అభిప్రాయాలు సమాజాభివృద్ధికి తీసుకోవాలని వారు సూచించారు. అందులో భాగంగానే ఇట్టి కార్యక్రమంలో జీజీ ఫౌండేషన్ వ్యవస్థపక అధ్యక్షులు లాయన్ నివేదన గుజరాతీ ఎంజేఎఫ్‌లు మాట్లాడుతూ అంతర్జాతీయ సీనియర్ సిటిజన్ దినోత్సవం యుఎస్‌లో 1988లో ఆగస్టు 21న నాటి అమెరికా అధ్యక్షులు రోనాల్డ్ రిగాన్ ఇట్టి దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించడం జరగిందని అదేవిధంగా సీనియర్ సిటిజన్ హక్కుల న్యాయవాది మాజీ అమెరికా అధ్యక్షులు బెంజ్‌మాన్, హారిసన్ జన్మదినాన్ని పురస్కరించుకుని యావత్ ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 21న ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటారని కొనియాడారు. సన్మానం పొందిన వారిలో ఫోరం అధ్యక్షులు దొండి నారాయణవర్మ, కార్యదర్శి సిహెచ్ గంగాధర్, కోశాధికారి ఎం. సాయన్న, విశ్రాంతి ఉద్యోగ సంఘ గౌరవ అధ్యక్షులు రాంరెడ్డి, కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, మాల్లారెడ్డి,ముత్తన్న, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, అల్లాపూర్ గంగామోహన్, ఓడ్డెన్న, లక్ష్మారెడ్డి, సుదర్శన్, నర్సయ్య, నరహరి, నర్సింలు, రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు డీజే దయానంద్, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, ఆనంద్, కాశీనాథ్, సునీల్, రేణు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనాలు సీజ్

ఏర్గట్ల, ఆగస్టు 21: మండల కేంద్రంలో బుధవారం ఆర్మూర్ ఆర్టీఏ అధికారులు పలు వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాలకు నెంబర్‌ప్లేట్స్, హెల్మెట్ ధరించని, సరియైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేసినట్లు మోటార్ వెకిల్ ఇన్స్‌పెక్టర్ వివేకానంద రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ట్రాఫిక్ సీఐ రమేష్, ఎస్సై రాము, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులో బంగారు గొలుసు చోరీ

నవీపేట,ఆగస్టు21: పడిగెల అనసూయ అనే మహిళకు చెందిన మూడు తులాల బంగారం, రూ.10వేల నగదుతో పాటు ఆధార్ కార్డును మంగళవారం సాయంత్రం బస్సులో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మెట్‌పల్లికి చెందిన అనసూయ సోమవారం నవీపేటలో ఉన్న తన సోదరుడు కొండ ప్రవీణ్ ఇంటికి రాఖీ పండుగ కొరకు వచ్చింది. తిరిగి మంగళవారం సాయంత్రం మెట్‌పల్లి వెళ్లడానికి నవీపేట బస్టాండ్‌లో భైంసా నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆర్డీనరీ ఆర్టీసీ బస్సులో ఎక్కగా బస్సు రైల్వేగేటు దాటిన తర్వాత కండక్టర్‌కు ఆధార్ కార్డును చూయించడానికి హ్యాండ్ బ్యాగ్‌ను తెరవగా అందులో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు, రూ.10వేల నగదుతో పాటు ఆధార్ కార్డు మాయమయ్యాయి. వెంటనే బస్సులో ఉన్న ప్రయాణికులను వాకబు చేసినప్పటికీ వాటి ఆచూకీ లభించలేదు. బాధితురాలి వద్ద కనీసం బస్సు టికెట్టుకు డబ్బులు గాని, ఆధార్ కార్డు గాని లేకపోవడంతో కండక్టర్ ఆమెను జానకంపేట బస్టాండ్ వద్ద దించివేశాడు. ఈ విషయంపై బుధవారం సాయంత్రం నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నానని బాధితురాలు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలో తమిళనాడు నీటి పారుదలశాఖ

అధికారుల సమీక్షా సమావేశం



పోచంపాడ్‌లో సమావేశంలో పాల్గొన్న తమిళనాడు అధికారులు

మెండోర, ఆగస్టు21: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు అతిథిగృహంలో తమిళనాడు రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు ఎస్సారెస్పీ ఆయకట్టు నీటి వినియోగపు సంఘం రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి వినియోగపు సంఘం ఉండేవని అని ఇప్పుడు మనుగడలో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గతంలో పని చేసిన నీటి వినియోగపు సంఘం రైతులతో నాయకులతో అధికారలు సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి వివరాలను సేకరించారు. రైతులు గతంలో మాదిరిగానే నీటిత సంఘాలు ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో రైతుల వివరాలు సేకరించి నివేదికను ఉన్నత అధికారులకు పంపనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ ఒరిస్సా పర్యటించామని, తెలంగాణలోపర్యటన తర్వాత మహరాష్ట్ర వెళ్లనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ చీఫ్ ఇంజనీర్ రాజు, కోఆర్డినేటర్ జగన్, పీఐఎం స్పెషలిస్ట్ నాగరాజు, ఎక్జ్యూటివ ఇంజనీర్ మంగయర్కరసి, సుబ్బారావు, కార్తికేయన్, ఏడీఏ కె.సునీత, అన్నపూర్ణ, తమిళనాడు నీటి పారుదల శాఖ అధికారుల బృందం, ఎస్సారెస్పీ డీఈఈ రఘుపతి, ఏఈఈ వంశీ, సారిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కోట్ల రూపాయలతో ఉడాయించిన మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు

పెద్దబజార్, ఆగస్టు 21:నగరానికి చెందిన మెడికల్ ఏజెన్సీ నిర్వహకుడు కోట్ల రూపాయలతో ఉడాయించాడు. నాందేవ్‌వాడ కేంద్రంగా ఏజెన్సీ నడిపిస్తున్న సదరు వ్యక్తి కుటుంబీకులతో కలిసి గాయత్రీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. వైశ్య సామాజిక వర్గానికి చెందిన సదరు వ్యక్తికి గత కొన్నేళ్లుగా మెడికల్ ఏజెన్సి నిర్వహిస్తున్నాడు. నెలనెలా కోట్ల రూపాయలలో టర్నోవర్ జరుగుతుండటంతో పలువురు ఇతనికి పెద్దమొత్తంలో అప్పులు ఇచ్చారు. ఈ జాబితాలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, హైదరాబాద్, విజయవాడకు చెందిన బడా ఏజెన్సీల నిర్వహకులు, వైద్యులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారు. ఏజెన్సీలకు పెద్ద మొత్తంలో చెల్లించాల్సి ఉండగా కొందరి నుంచి లక్షలు అప్పులు తీసుకున్నాడు. నేడు రేపు డబ్బులు ఇస్తామని చెప్పి తీరా ఈనెల 16 నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండగా ఏజెన్సీకి, ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి. తాము మోసపోయామని గుర్తించిన బాధితులు ఒకరికొకరు బయటకు వస్తున్నారు. ఏజెన్సీ నిర్వహకుడు మార్కెట్‌లో ఇవ్వాల్సిన రూ.10 కోట్ల వరకు ఉంటుందని ప్రచారం జరుగుతుంది.

రుద్రూర్‌లో స్వల్ప ఘర్షణ

రుద్రూరు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ సందర్భంగా రుద్రూరు మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో దుకాణ సముదాయాలను బంద్ చేయిస్తున్న వారిని రుద్రూరు సీఐ జయేష్‌రెడ్డి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు మాల మహానాడు నాయకులకు స్వల్ప ఘర్షణ ఏర్పడింది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బోధన్‌రూరల్,ఆగస్టు21: సాలూర మండలం హున్స గ్రామానికి చెందిన మురిగె బస్వరాజ్(24)అనే వ్యక్తి ఈ నెల 17వ తేదిన పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ బుధవారం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మురిగె బస్వరాజ్ తాగుడుకు బానిసై తల్లిదండ్రులతో గొడవపడి ఈ నెల 17న పురుగుల మందు సేవించాడని పేర్కొన్నారు. చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పలు చోట్ల బంద్ విజయవంతం



బోధన్‌లో బంద్ సందర్భంగా మాలల ర్యాలీ



నగరంలో డిపో ఎదుట ధర్నా చేస్తున్న మాలలు



వర్ని పోలీసుల అదుపులో ఉద్యమకారులు

బోధన్‌రూరల్,ఆగస్టు21: మాల మహనాడు ఇచ్చిన బంద్ బుధవారం బోధన్‌లో కొనసాగింది. మాల మహనాడు, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన నిరసన ర్యాలీని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ముందస్తుగా నాయకులను అరెస్టు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా మాల మహనాడు, బీఎస్పీ నాయకులు అంబేద్కర్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నీరడి రవికుమార్, పాండులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును పునర్ సమీక్షించాలని, ఒక వర్గాన్ని దృష్టిలో పెట్టుకుని వర్గీకరణ చేయడం సరికాదన్నారు. ఇంకా 67కులాలు ఎస్సీ జాబితాలో ఉన్నాయన్న అంశాన్ని గుర్తించుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపడం బాధకరమన్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టు చేయడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు నాయకులు వాగ్మారే సూర్యకాంత్, డిస్కొ సాయిలు, సంజీవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. భారత్ బంద్‌లో భాగంగా పోలీసులు మాల మహనాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్, నాయకులు కారంస్వామి, పల్నాటి యాదగిరిలను ముందస్తుగా అరెస్టు చేశారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

● ఎస్సీ వర్గీకరణ రద్దు చేసి న్యాయం చేయాలి

కోటగిరి,ఆగస్టు21: ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేసి తగిన న్యాయం చేయాలని, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సంఘం డిమాండ్ చేసింది. వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం ఇచ్చిన భారత్ బంద్ కోటగిరి ఉమ్మడి మండలంలో విజయవంతమైంది. కోటగిరిలో వ్యాపార సంస్థలు, ప్రైవేటు పాఠశాలలు, దుకాణాలను స్వచ్చందంగా బంద్ పాటించారు. పోతంగల్‌లో బంద్ పాక్షికంగా కొనసాగింది. కోటగిరి మండల కేంద్రంలో మాల మహనాడు సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాల మహనాడు సంఘం నాయకులు మిర్జాపూర్ సాయన్న మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు సంఘం నాయకులు కాలే సాయిలు, జంగం సాయిలు, మారుతి, శివ తదితరులు పాల్గొన్నారు.

● భారత్ బంద్‌లో భాగంగా మాలమహానాడు ధర్నా

సుభాష్‌నగర్: ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారత్ బంద్ పిలుపులో భాగంగా మాలమహానాడు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిపో-1 ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. బంద్‌లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, పెట్రోల్ బంక్‌లు, వ్యాపార సముదాయాలను బంద్ చేయించారు. డిపో ఎదుట బస్సులు బయటకు రాకుండా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్‌కుమార్ మాట్లాడుతూ మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఉందని అన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఏబీసీడీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని చెప్పిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రాలకు వర్గీకరణ ఎలా ఇస్తుందని అన్నారు. వర్గీకరణ అంశాన్ని పునఃపరిశీలించాలని కోరారు. లేదంటేఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంగారు సాయిలు, చంద్రశేఖర్, సుశీల్‌కుమార్, నీరడి లక్ష్మణ్, నాగరాజు, చందు, రాజు, పులిజైపాల్ తదితరులు పాల్గొన్నారు.

● చందూర్‌లో బంద్.. వర్నిలో విఫలం

వర్ని: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఏడుగురు జడ్జీల ధర్మాసనం ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం తలపెట్టిన బంద్ చందూర్ మండల కేంద్రంలో విజయవంతం కాగా వర్ని మండలంలో విఫలం అయింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించుకోవాలని ఆందోళనకారులు విజ్ఞప్తి చేశారు. నిరసనలో ఇందూర్ సాయిలు, పోతరాజు మహేందర్, అశోక్, భాస్కర్, చందూర్, ఘన్‌పూర్ మాల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● భీమ్‌గల్‌లో భారత్ బంద్ విజయవంతం

భీమ్‌గల్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్ మీద ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకంగా దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు భీమ్‌గల్ పట్టణంలో మాల సంక్షేమ సంఘం ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం భారత్ బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ ఇదీ కేవలం కుట్రపూరితంగా ఎస్సీ, ఎస్టీలో విభేదాలు సృష్టించడానికి వర్గీకరణను తీసుకువచ్చారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తాము పోరాటాలు చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సోమిడి దేవిదాస్, పర్స రత్నయ్య, పర్స అనంతరావు, కునే రమేష్, మేకల శ్రీనివాస్, బట్టు అనిల్, నందు, సురేష్, బీమ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నవీపేటలో రాస్తారోకో

నవీపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహనాడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని బాలుర పాఠశాలను మూసి వేయడానికి యత్నిస్తున్న 12మంది మాల మహనాడు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంగెం శ్రీనివాస్, గౌరు రాజు, బుచ్చన్న, సాయిలు, రాములు, శ్యామ్, సతీష్, మోహన్, తదితరులున్నారు.

● ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల ధర్నా

వేల్పూర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం వేల్పూర్ మండల కేంద్రంలో మాలలు ధర్నా నిర్వహించారు. అంతకు ముందు మండల గ్రామాల నుంచి వేల్పూర్‌కు చేరుకున్న మాల సంఘాల సభ్యులు, మాల ఉప కులాల సంఘాల సభ్యులు వేల్పూర్‌లోని ప్రధాన వీదులగుండా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీవర్గీకరణపై సుప్రీం కోర్టు ఏడు జడ్జిల ధర్మాసానం ఇచ్చిన తీర్పును పున సమీక్షించుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో ఆర్టికల్ 341 చెప్పినట్టు జాతులను ఏకం చేయాలి కానీ విడగొట్టరాదని చెప్పిన ఆర్టికల్ 341వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని నాయకులు కోరారు. అనంతరం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామాల మాల సంఘాల నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మాల ఉపకులాలు, బీఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పున సమీక్షించుకోవాలని, రాజ్యాంగంలో ఆర్టికల్ 341 చెప్పినట్టు జాతులను ఏకం చేయాలని వీడగొట్టరాదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూగ ప్రభాకర్, శెట్‌పల్లి నారాయణ, కొంతం, మురళీధర్, పూర్ణచందర్, మచ్చర్ల ప్రభాకర్, కోమన్‌పల్లి రాజన్న, గంగన్న, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

● వర్నిలో ఆందోళనకారుల అరెస్టు

వర్ని: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను నిరసిస్తూ బుధవారం వర్ని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. వర్గీకరణ రద్దు కోసం బంద్ పిలుపులో భాగంగా పోలీసులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాల ఉద్యమకారులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గైని గోపి, సంజీవ్, రామచందర్, కార్తీక్, సునీల్, సుభాష్, అశోక్, బస్వంత్, వినోద్, మల్లేష్‌లను అదుపులోకి తీసుకున్నారు.

అడ్డు అదుపు లేకుండా అడవుల నరికివేత

సిరికొండ ఆగస్టు 21: నిజామాబాద్ జిల్లాలో అడవులు ఉన్నాయంటే అది ఒక్క సిరికొండ మండలంలోనే ఉన్నాయని అధికారులు చెప్పుకుంటారు. అదే మండలంలో గురిజనుల అడవీపై మాకే హక్కు ఉందంటూ విచ్చలవిడిగా అడవులను నరికివేస్తున్న ప్రభుత్వం, అధికారులు కళ్లప్పగించి చోద్యం చూస్తున్నారని ప్రజలు కళ్లు, నోళ్లు మూసుకుంటున్నారు.మండలంలో ఇక అడవులు, గుట్టలు ఏమైనా మిగిలి ఉంటాయా అని గిరిజనేతరులు చర్చించుకుంటున్నారు. నిన్న జంగిలోడి తండా, నేడు తూంపల్లి సెక్షన్‌లోని దొంగచెరువు ప్రాంతం,గుడిలింగాపూర్, ,పందిమడుగు,దూప్యతండాలో కొండలను రాత్రికి రాత్రే మైదానులుగా మారుస్తున్నారు. సిరికొండకు నాలుగు కిలో మీటర్ల దూరాన గల బొడ్డుమామిడి చెరువు ఎఫ్‌టీఎల్‌లో అడవీని పెట్రోలు రంపాలతో కోసి కుప్ప వేశారు. శ్రీలొంకరామలింగేశ్వర ఆలాయానికి వెళ్లే రోడ్డు ప్రక్కనే ఐదారు ఎకరాలలో అడవీని నరికి వేసి మైదానంగా మార్చివేశారు. ఇంత జరుగుతున్న అటవీశాఖ ఉన్నాతాధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహారించడం విడ్డూరంగా ఉంది. పేద మధ్యతరగతి వారికి 2005లో ఆనాటి ప్రభుత్వం సిరికొండ సమీపాన 532 సర్వే నెంబర్‌లు ఇస్తే అది మాఅటవీ భూమి అని సాగుచేసుకోవడానికి వెళ్తె అడ్డుకునే అటవీ శాఖ అధికారులకు అడివంత మైదానాలుగా మారుతుంటే అక్కడ అడ్డుకోవడానికి వీళ్లకు చేతులు రావా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం రోడ్లు వేస్తే అడ్డుకోవడానికి పరిగెత్తుకుంటే వచ్చే అటవీ శాఖ అధికారులు ఎక్కడ అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాకాల నుండి పందిమడుగు వచ్చే రోడ్డును నిలిపివేశారు. చీమన్‌పల్లి-శాంతినగర్ మధ్యలో వేములవాడ వెళ్లె రోడ్డును నిలిపివేశారు. కొండపూర్ నుంచి రెడ్డిపేట్ బడి తండా వరకు కామారెడ్డి వెళ్లె డబుల్‌రోడ్డు పనులను నిలిపి వేసిన ఘనత అటవీ శాఖ అధికారులకు దక్కింది. ఏమంటే అటవీ శాఖ అనుమతి కావాలంటారు. అడవులను నరికివేయడానికి అనుమతినిచ్చారా అని స్థానికులు నిలదీస్తున్నారు.తూంపల్లి సెక్షన్ పరిధిలో దొంగ చెరువు నుండి గర్గెపహాడ్ సమీపాన, మాలగుట్ట ప్రాంతంలో, గుడిలింగాపూర్, దూప్యతండా, పందిమడుగు సెక్షన్‌లో పాకాల లో,రావుట్ల సెక్షన్‌లో పిప్రి, హోన్నాజిపేట్ సెక్షన్‌లో ముషీర్‌నగర్, కొండపూర్ శివారులో అడవి మైదానంగా మారిపోయింది. జంగిలోడి తండా వెనుకాల అడివిని ఇష్టారీతిగా నరికి వేయడంతో పాటు జెసీబీలు, ఫ్రంట్‌బ్లేడ్ ట్రాక్టర్లతో రాత్రికి రాత్రి అడవులన్ని పొలాలుగా మారుతున్నాయి.



దూప్యతండా శివారులో చదును చేసిన దృశ్యం

సిరికొండ లో అడవీ నరికివేసే సంస్కృతి లేకుండే కాని రెండు మూడు రోజులుగా బొడ్డుమామిడి చెరువు శిఖంలో ఇష్టారీతిగా నరికివేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది జంగిలోడి తండా గొడవలో మునిగి పోయిన విషయం గమనించిన వారు సిరికొండ అడవీలో నరికివేతకు పాల్పడడం ఆందోళనకరం. ఇప్పటికే వర్షాలు కురువక తీవ్రమైన ఆందోళనలో రైతాంగానికి ఉన్న అడవీ కాస్త ఆవిరైతే మేమంత ఏమి చేయాలో పాలుపోవడం లేదని సిరికొండ వాస్తవ్యులు ఆవేదన చెందుతున్నారు.

● అధికారులకు ఏజెంట్లుగా మారిన కొందరు నేతలు

తూంపల్లి, పాకాల,జినిగ్యాల, పందిమడుగు,దూప్య తండాలో కొంతమంది నేతలు అటవీ శాఖ అధికారులకు రహస్య ఏజెంట్లు మారి అడవులను నరికివేతను పోత్సమిస్తున్నారని గ్రామాల్లో ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. ఎకరాన 30 వేలు, బోరుబావి తవ్వుకుంటే అదనంగా పదిహేను వేల నుండి 20వేలు వసూలు చేస్తూ అటవీ శాఖ అధికారులకు అందజేస్తున్నారని ప్రజలు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

● ఉన్నాతాధికారులు స్పందించాలి

గ్రామాల్లో అడ్డు అదుపు లేకుండా అడవుల నరికి వేతను అటవీ శాఖ ఉన్నాతాధికారులు తక్షణమే స్పందించి అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఉన్నాతాధికారులు జోక్యం చేసుకోకుంటే ఉన్న అడవీ ఏమాత్రం మిగిలే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. అడవీ శాఖ అధికారలంటే ఎవరికి లెక్కలేకుండ పోయిందంటున్నారు. అధికారులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

అడవుల నరికివేత మా దృష్టికి వచ్చిందని

నరికివేతను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు రేంజ్ అధికారి చెప్పారు.అడ్డగోలుగా నరికివేస్తున్న విషయం అటవీశాఖ ఉన్నాతాధికారులకు,జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసికెళ్లి నట్లు ఆయన చెప్పారు.

\- వినయ్‌నాయక్, రేంజ్ అధికారి

రైతు సమావేశానికి బీజేపీ మద్దతు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు21: ఈనెల 24న రైతు సమావేశానికి బీజేపీ పార్టీ పూర్తి మద్దతునిస్తుందని బీజేపీ నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ ఎన్నికలకు ముందు ఏం చేసిందో మోదీ నాయకత్వంలో అమలవుతున్నాయన్నారు. రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన మాటను తప్పడం వారికి అలవాటు అని బీజేపీ పార్టీని విమర్శిస్తే సహించేదిలేదని, గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తే రూ.17వేల కోట్లు ఖర్చు అయ్యాయని, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల లెక్కల ప్రకారం 47లక్షల రైతులకు రూ.49వేల500కోట్లు అవసరమని తూతూ మంత్రంగా రుణమాఫీ చేయడం ఏంత వరకు సమంజసమని వారు అన్నారు. కాంగ్రెస్ నాయకుడు మార చంద్రమోహన్ బీజేపీని విమర్శించే నైతిక హక్కులేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, బీజేపీ నాయకులు ద్యాగ ఉదయ్, నూతుల శ్రీనివాస్, పాన్‌శీను, పొల్కం వేణు, రంగన్న, జక్కం పోశెట్టి, ఆరే రాజేశ్వర్, పెద్దోళ్ళ భరత్, తోట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌వో

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు21: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీనిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రోగులతో డాక్టర్‌ల పనితీరు విషయమై అడిగితెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. విషజ్వరాలు రావడంతో క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు పెరిగేలా చూడాలని, ఆపరేషన్ లేకుండా నర్మల్ డెలివరీలు అయ్యేలా డాక్టర్‌లకు సూచించారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, జిల్లా ఏరియా ఆసుపత్రి డాక్టర్ శివశంకర్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ రవికుమార్, డాక్టర్‌లు, సిబ్బంది ఉన్నారు.

వ్యాయామం చేస్తూ ఏఎస్సై మృతి

ఖిల్లా, ఆగస్టు 21: నగరంలోని ఒకటవ టౌన్‌లో పనిచేస్తున్న దత్తాద్రి (52) ఏఎస్సై బుధవారం వ్యాయామం చేస్తూ తన ఇంటి వద్ద ఒకేసారి కిందపడి మృతి చెందాడు. నగరంలోని గాయత్రీనగర్‌లో నివాసం ఉండే దత్తాద్రి ఉదయం వేళ తన ఇంటి వద్ద వ్యాయామం చేసే సమయంలో కింద పడ్డాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో ఆయనను పరిశీలించిన వైద్య సిబ్బంది అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. పోలీస్ శాఖలో గత ముప్పై ఏళ్లుగా పనిచేస్తున్న ఆయన కానిస్టేబుల్‌గా చేరారు. ఆయన మృతి పట్ల స్నేహితులు, బ్యాచ్‌మెంట్‌లు దిగ్భ్రాంతికి లోనయ్యారు.ఇటీవల పోలీస్ శాఖలో ఏదో ఒక పని ఒత్తిడితో సిబ్బంది మృతి చెందడం పోలీస్ శాఖను కలచివేస్తుంది.

వైద్యురాలిపై హత్యకు నిరసనగా విద్యార్థుల ర్యాలీ

ముప్కాల్, ఆగస్టు21: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఓ మహిళ డాక్టర్‌ను హత్యను ఖండిస్తూ మహిళలపై దాడులను నిరసిస్తూ బుధవారం బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు.ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కర్తన్ మాట్లాడుతూ మహిళ డాక్టర్‌పై దుండుగులు అత్యాచారం, హత్య చేయడం హీనమైన చర్య అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భానుచందర్, ఆకుల లక్ష్మణ్, రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నవీపేట,ఆగస్టు21: మండలంలోని ధర్మారంకు చెందిన విడగొట్టు సాయిలు(50)అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడని ఏఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. గత నెల 16న సాయిలుకు ధర్మారం వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలు కాగా వెంటనే అతనిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సాయిలు మృతి చెందాడని మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మోడల్, కేజీబీవీల టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

నవీపేట,ఆగస్టు21: రాష్ట్రంలోని మోడల్ పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్(తెలంగాణ ప్రొగెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ పాఠశాలలు ఏర్పడినప్పటి నుండి ఇంత వరకు బదిలీలు, ప్రమోషన్‌లు చేపట్టలేదని వెంటనే సంబంధిత ఉపాధ్యాయులకు ప్రమోషన్‌లతో పాటు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాలల్లో రాణించాలి

బోధన్‌రూరల్,ఆగస్టు21: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు బాధాకరమని వాటిని అరికట్టే విధంగా ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకువస్తుందని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజేత కళాశాల డైరెక్టర్ అంజనా దేవి, లయన్స్ ప్రతినిధులు బాలగంగాధర్ రావు, పాండురంగారావు, పాపారావు తదితరులున్నారు.

పలు దుకాణాల్లో ప్లాస్టిక్‌పై తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు21: మున్సిపల్ పరిధిలోని పలు దుకాణాలలో మున్సిపల్ సిబ్బంది ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వ హించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు ఆదేశాల మేరకు బుధవారం పలు దుకాణాలలో ప్లాస్టిక్‌ను తనిఖీ నిర్వహించి ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్ పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సి పల్ సిబ్బంది అక్షయ్, రవి, ప్రశాంత్, నరేష్, సంతోష్, నర్స య్య, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

డొంకేశ్వర్, ఆగస్టు21:చదువు మధ్యలో మానేసి చదువుకోవడానికి ఆసక్తి ఉన్న వారికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్టడి సెంటర్ ద్వారా ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హెచ్‌ఎం.సురేష్‌కుమార్ ఒక ప్రకట నలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 10వరకు ఏలా ంటి అపరాద రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. సెప్టెంబర్ 11నుంచి 3వ తేదీ వరకు అపరాధన రు సుముతో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.ఆసక్తిగల వారు ఆయా జిరాక్స్ కాపీలతో పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

మెండోరలో ఒకరి మృతి

మెండోర, ఆగస్టు21: మండల కేంద్రానికి చెందిన సాకలి లక్ష్మణ్(65) కాకతీయ కాలువలో పడి మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. మృతుడు మంగళవారం ఉదయం దోబి ఘాట్ వద్ద బట్టలు ఉతికి స్నానం చేయడానికి కాకతీయ కాలువలో దిగగానే నీటి ప్రవాహనికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడని మృతదేహం బుధవారం ఉదయం మెండోర శివారులో లభ్యమైనట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు మెండోర గ్రామానికి ఉపాధి కోసం బట్టలు ఉతకడానికి 15ఏళ్ళ క్రితం కుటుంబసభ్యులతో వచ్చారని, ఊరుగాని ఊరు వచ్చి ప్రాణం పోయిందని కుటుంబసభ్యులు కన్నీటిపర్వంతమయ్యారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రజక సంఘం నాయకులు కోరారు.

వివేక్‌నగర్‌తండాలో తాళం వేసి ఇంట్లో దొంగతనం

● నిందితుడి అరెస్టు, రిమాండ్

జక్రాన్‌పల్లి, ఆగస్టు21:మండలంలోని వివేక్‌నగర్‌తండా గ్రామంలో తాళం వేసి ఇంట్లో దొంగతనం జరిగినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. బుధవారం ఎస్సై తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వివేక్‌నగర్‌తాండా గ్రామానికి చెందిన బానవత్ సురేష్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లారని తెలిపారు. ఇంకు ముందు బానవత్ సురేష్ దగ్గర కూలీ పని చేసిన కోనేరు నరేష్ మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి తాళలు పగులగొట్టి బీరువలో ఉన్న రెండు తులాల బంగారు నెక్లెస్, తులం జత బంగారు బుట్టకమ్మలు, బంగారు ఉంగారం, 20తులాల జత వెండి పట్టగొలుసులు, రూ.లక్ష నగదును నిందితుడు నరేష్ దొంగలించి పరారయ్యాడని ఎస్సై తెలిపారు. ఈ దొంగతనం విషయమై బానవత్ సురేష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు ఎస్సై తెలిపారు. నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి సొమ్మును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి



జనార్దన్‌చారి(ఫైల్)

బోధన్‌రూరల్,ఆగస్టు21: బోధన్ పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు జనార్ధన్ చారి బుధవారం తిరుపతిలో గుండెపోటుతో మృతి చెందారు. జనార్ధన్ చారి కుటుంబ సభ్యులతో తిరుపతి వెళ్లి మెట్లపై నుండి దర్శనానికి వెళ్తుండగా ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు స్వర్ణకార సంఘం నాయకులు తెలిపారు. అతని వెంట భార్య, కుమార్తె ఉన్నారన్నారు. అందరితో కలిసిమెలిసిగా ఉండే జనార్ధన్ చారి ఆకస్మాత్తుగా చిన్న వయసులోనే గుండెపోటుతో మృతి చెందడం బాధకరమన్నారు.



నగరేశ్వర ఆలయ సన్నిధిలో గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆలయంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు

బీర్కూర్, ఆగస్టు 21: మండలకేంద్రంలోని నగరేశ్వర ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు బుధవారం ఉదయం నుంచి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నగరేశ్వర ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బీర్కూర్‌కు చెందిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆలయ పునర్నిర్మాణానికి నడుం బిగించారు. విరాళాలు సేకరించి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ మేరకు బుధవారం నుంచి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం గణపతి పూజ, గోపూజ, నవగ్రహ మండల పూజ, గణపతి హోమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఇందులో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బిచ్కుంద, ఆగస్టు 21: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న సబ్సిడి పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చేపలపెంపకానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందుటకు దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సీ కార్పొరేషన్ ద్వారా చేపల పెంపకానికి రూ.4లక్షల 50 వేల రుణాలు అందించడం జరుగుతుందని దరఖాస్తుదారుడికి అర ఎకరం భూమి అందులో బోరుబావి, ఎస్సీ ధ్రువీకరణ పత్రం, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌ఖాతా సీబీల్ కలిగి ఉండాలన్నారు. రూ.4లక్షల 50 వేల రుణంలో ఎస్‌సీ కార్పొరేషన్ ద్వారా రూ.2లక్షల 25 వేల సబ్సిడీ పీఎం అజయ్ పథకం ద్వారా రూ.50 వేల సబ్సిడీ వర్తిస్తుందని, ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఇందులో డీఆర్‌డీఏ డీపీఎం రమేష్, బ్యాంక్ మేనేజర్ రవికాంత్, ఎంపీడీవో గోపాల్, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ చందు, బ్యాంక్ మేనేజర్ భీంరావు, ఐకేపీ ఏపీఎం నాగరాజు, తదితరులున్నారు.

అదుపుతప్పి వాగులో పడిన కారు

బీర్కూర్, ఆగస్టు 21: బీర్కూర్ సమీపంలోని గైపీర్ల వద్ద కారు అదుపుతప్పి వాగులో పడింది. వాగులో నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా కారులో ఉన్న ముగ్గురు డోర్‌లను తెరిచి ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. బీర్కూర్‌కు చెందిన కుర్రి కృష్ణ అనే వ్యక్తి తన కారును బిచ్కుందకు చెందిన ముగ్గురు స్నేహితులకు ఇచ్చాడు. ముగ్గురు స్నేహితులు కారు తీసుకుని బిచ్కుందకు వెళుతున్నారు. ఈ క్రమంలో గై పీర్ల వద్ద కారు అదుపుతప్పిరోడ్డు పక్కనే ఉన్న వాగులో పడింది. నీటి ప్రవాహానికి కారు కొద్ది దూరం కొట్టుకుపోయింది. వెంటనే కారులో ఉన్న ముగ్గురు డోర్‌లు తీసుకుని ప్రాణాలతో బయటకు వచ్చారు. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. అనంతరం బీర్కూర్‌లో ఉన్న తమ స్నేమితులకు సమాచారం అందించడంతో వారు వాగు వద్దకు వచ్చి కారును బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ కేసులో నలుగురు రిమాండ్

లింగంపేట, అగస్టు 21: నకిలీ రిజిస్టేషన్ కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. బుధవారం లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని అయ్యపల్లి గ్రామానికి చెందిన చల్ల నారాయణ తండ్రి వెంకయ్యకు తన వ్యవసాయ భూమిని 2002లో అదే గ్రామానికి చెందిన చల్ల నారాయణ తండ్రి హన్మయ్యకు విక్రయించాడు. అట్టి భూమిని విక్రయించిన నారాయణ తిరిగి స్వాధీనం చేసుకునేందుకు తన కుమారుని పేరిట హద్దులను మార్చి నకిలీ రిజిస్టేషన చేశాడు. నకిలీ రిజిస్టేషన్ పత్రాలతో భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా 2002లో భూమిని కొనుగోలు చేసిన చల్ల నారాయణ పోలీసులకు పిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి 11మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు. వీరిలో బుధవారం చల్ల రాజు, చల్ల రాములు,చల్లమాణిక్యం, చల్ల గంగాధర్ నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలియజేశారు. మరో ఏడుగురు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుని రిమాండ్ చేస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా

బాన్సువాడ, ఆగస్టు 21: గురువారం బాన్సువాడలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు ధర్నాకు నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు, పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దోమకొండ: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ముత్యంపేట సింగిల్ విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, కుంచాల శేఖర్‌లు మాట్లాడుతూ గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

భిక్కనూరు: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీచేయాలని భిక్కనూరు మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం భిక్కనూరులో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గురువారం భిక్కనూరు తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హజరై ధర్నాని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అత్తెలి శ్రీనివాస్, యాదగిరి, భూమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణు,వెంకట్‌రెడ్డి, పోతిరెడ్డి, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రేషన్ బియ్యం దందా

- నాగిరెడ్డిపేటలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొంటూ సాగిస్తున్న వ్యాపారం
- ఇటీవల ఓ బియ్యం గోదాంపై ఎన్‌ఫోర్సుమెంట్ టాస్క్‌ఫోర్సు అధికారుల దాడి
- 20 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత, కేసు నమోదు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 21: మండల కేంద్రానికి చెందిన కొందరు వ్యక్తులు రేషన్ బియ్యం(పీడీఎస్ బియ్యం) అక్రమ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. స్థానిక గోపాల్‌పేట్‌కు చెందిన ఐదారుగురు వ్యక్తులు ఈ దందాను సాగిస్తున్నారు. రైస్‌మిల్లుల యాజమానులు, కిరాణం వ్యాపారులు, బియ్యం వ్యాపారస్తులు కొందరు ఈ అక్రమ దందాను యథేచ్చగా సాగిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో కొందరు వ్యక్తులు తమ రేషన్ కార్డు ద్వారా రేషన్ షాపుల నుంచి బియ్యాన్ని తీసుకుని వాటిని తినకుండా బియ్యం వ్యాపారులకు తక్కువ ధరకే అమ్మేస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకున్న బియ్యం అక్రమ వ్యాపారులు గ్రామాలలో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేస్తారు. కిలో బియ్యం రూ.15 నుంచి 18లకు కొనుగోలు చేసి తమ గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేసి రాత్రివేళ గుట్టు చప్పుడు కాకుండా వాహనాల్లో లోడ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లాభాలు గడిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్ యజమాని గ్రామాలలో నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గుట్టు చప్పుడు కాకుండా తన రైస్‌మిల్లుకు తరలించి రైస్‌మిల్లులో రాత్రివేళ రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి ఎవరికీ అనుమానం రాకుండా నూకలను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఈ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు సరిహద్దు మండలం కావడంతో ఈ మండలంలో ఉన్నతాధికారుల తనిఖీలు లేకపోవడంతో మండలంలో ఈ రేషన్ బియ్యం అక్రమ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు రైస్ మిల్లులను బియ్యం వ్యాపారుల గోదాములను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, అక్రమ రేషన్ బియ్యం దందాపై కళ్లెం వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● బియ్యం గోదాంపై అధికారుల దాడి

మండల కేంద్రం గోపాల్‌పేట్‌లో పీడీఎస్ బియ్యం వ్యాపారం



గోపాల్‌పేట్‌లోని బియ్యం గోదాంపైన ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు

చేస్తున్న మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన తుమ్మల ఆగమయ్య బియ్యం గోదాంపై ఇటీవల ఎన్‌ఫోర్సుమెంట్ టాస్క్‌ఫోర్సు అధికారులు దాడి చేశారు. తుమ్మల ఆగమయ్య గోపాల్‌పేట్‌లో సన్న బియ్యం విక్రయించే దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. సన్న బియ్యం విక్రయం పేరుతో పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నాడు. తన దుకాణం వెనుకాల ఉన్న షెడ్డులో బియ్యం గోదాంను ఏర్పాటు చేశాడు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ గోదాంలో నిలువ చేస్తూ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తుండటంతో, సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్సుమెంట్, టాస్క్‌ఫోర్సు అధికారులు ఆగమయ్య బియ్యం గోదాంపైన దాడి చేశారు. గోదాంలో అధికారులు తనిఖీలు జరుపగా 20 బస్తాలు, సుమారు 8 నుంచి 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం దొరకడంతో అధికారులు ఆగమయ్యపై కేసు నమోదు చేశారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేసి న్యాయం చేయాలి

- దళిత నాయకుల డిమాండ్
- జిల్లావ్యాప్తంగా మాల మహానాడు ఆధ్వర్యంలో బంద్
- పలుచోట్ల ర్యాలీలు, ధర్నాలు

బాన్సువాడ, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని న్యాయం చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. దళిత కల్యాణ్ సమితి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భారత్ బంద్ పిలుపులో భాగంగా బాన్సువాడ పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అంశాన్ని ఉన్నత న్యాయస్థానం రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట్ ప్రశాంత్, మల్లూర్ సాయిలు, దొనకంటి వినోద్, నెర్రె నరసింహులు, పాండు, అశోక్, హనుమంతు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకు నిరసనగా బుధవారం నిజాంసాగర్ మండలంలో మాల మహా నాడు వర్గీకరణ పోరాట సమితి బంద్, రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్రంలో పాఠశాలలు, వ్యాపార సంస్థలు బంద్ పాటించాయి. మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన బంద్, రాస్తారోకో ఎల్లారెడ్డి-నాందేడ్ రహదారిపై గంట పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా రాకపోకలు స్థంభించిపోయాయి. మండల కేంద్రంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు పోరాట సమితి కన్వీనర్ గైని విఠల్‌తో పాటు బేగరి రాజు, ఫణికుమార్, రాజు, ప్రకాష్, సాయిలు, మంగ భూమయ్య, పాల్ దినకర్, మాల మహానాడు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెనుకకు తీసుకునే వరకు పోరాడుతామని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వివేకనంద అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం ఇచ్చిన భారత్ బంద్ లింగంపేట మండలంలో విజయవంతం అయింది. ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై ధర్నా చేశారు. తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పేరుతో మాల మాదిగలను విభజించి వారి ఐక్యతను దెబ్బతీయడమేనని ఆయన తెలిపారు. బంద్ సందర్భంగా మండలంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు హోటళ్లు, ప్రయివేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు సభ్యులు ముదాం సాయిలు, వివేకానంద, బండి రాజయ్య, లక్ష్మన్, సాయిలు, శ్రీనివాస్, జీవన్, సాయిబాబ, సంతోష్, స్వామిలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మాలమహానాడు సభ్యులు, తదితరులు ఉన్నారు.

మద్నూర్: ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ భారత్ బంద్‌లో భాగంగా మాల మహానాడు ఆధ్వర్యంలో ఉమ్మడి మద్నూర్, డోంగ్లి మండల కేంద్రాలలో బుధవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు అనే నినాదాలు చేశారు. మాల పొలిటికల్ జేఏసీ కామారెడ్డి జిల్లా చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తంచేశారు. ఇందులో ఆకాష్, మారుతి, సుధీర్, జైపాల్, సందీప్, గంగాధర్, ఎస్సీ మాలలు, ఉప కులాలు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలకేంద్రంలో బుధవారం భారత్ బంద్ పిలుపు మేరకు ఎస్సీ, ఎస్టీ ఉప కులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను తక్షణం రద్దు కోసం నిరసిస్తూ నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని వాణిజ్య వ్యాపార సముదాయాల దుకాణాలు హోటళ్ల స్వచ్ఛంధంగా బంద్‌కు సహకరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బంద్ నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పును తీవ్రంగా నస్రుల్లాబాద్ మండల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం కమిటీ మెంబర్లు, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక సమితి నాయకులు అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఉల్లంఘ బాల సాయిలు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం ధర్నా రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నీరడి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గైని పోశెట్టి, శ్రీనివాస్, ప్రచార కమిటీ అధ్యక్షుడు గని శ్రీనివాస్, మండల కమిటీ ముఖ్య సలహాదారులు గౌడ్, నరసింహులు, ఉల్లెంగ చిన్న సంగయ్య, మహేష్, సాయికుమార్, వివిధ గ్రామాల అంబేద్కర్ సంఘం మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు



నిజాంసాగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మస్కట్‌లో చిక్కుకున్న కామారెడ్డి జిల్లావాసి

● విదేశాంగశాఖ అధికారికి బాధితుడి భార్య ఫిర్యాదు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 21: రామారెడ్డి మండలం మద్దికుంటకు చెందిన యెల్లి ప్రభాకర్ గత మూడున్నర నెలలుగా ఓమాన్ రాజధాని మస్కట్‌లో పని,జీతం, సరైన భోజనం, వసతి కూడా లేకుండా ఇబ్బంది పడుతున్న దీనస్థితి వెలుగులోకి వచ్చింది. టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మండభీంరెడ్డి సహకారంతో బాధితుడి భార్య అనసూయ హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ అధికారి ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్స్‌కి మంగళవారం ఫిర్యాదు చేశారు. మస్కట్ బల్దియాలో రోడ్డు క్లీనర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఏజెంట్ తమ నుంచి రూ.60 వేలు తీసుకున్నాడని బాధితుడి భార్య అనసూయ తెలిపింది. మే 8న మస్కట్‌కు చేరుకున్న తన భర్త ప్రభాకర్ ఎలాంటి పనిలేకుండా ఒకరూంలో విద్యుత్, నీటి సమస్యలతో కాలం వెళ్లదీస్తున్నాడని తెలిపింది. కామారెడ్డిలో తమకు తెలిసినవ్యక్తి ద్వారా రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన సామ్ ట్రావెల్ సర్వీసెస్ అనే లైసెన్స్ రిక్రుటింగ్ ఏజెన్సీ ద్వారా వీసా, ఎమిగ్రేషన్ సేవలు అందించారని అన్నారు. ముంబాయి నుంచి మస్కట్ చేరిన నాటి నుంచి ప్రభాకర్ ఇబ్బందులకు గురి అవుతున్నాడని,రిక్రూటింగ్ ఏజెన్సీపై, విదేశీ యజమానిపై తగిన చర్య తీసుకుని ప్రభాకర్‌కు ఉద్యోగం కల్పించి తగిన న్యాయం చేయాలని అనసూయ విజ్ఞప్తి చేశారు. అయితే విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని మదద్ హెల్ప్‌లైన్ వారు స్పందించి ఓమాన్‌లోని ఇండియాన్ ఎంబసీ ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎక్స్‌లో ట్విట్ చేశారని టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మండభీంరెడ్డి తెలిపారు. ఓమాన్‌లోని ఇండియాన్ ఎంబీసీ సిబ్బంది ఒకరు బుధవారం ప్రభాకర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్నారని ఎంబసీ నుంచి కాల్స్‌చేస్తే కంపెనీ యాజమాన్యం, సబ్ కాంట్రాక్టర్ స్పందించడం లేదన్నారు. కేసును లేబర్ కోర్టుకు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని తెలిపారు. అయితే కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు రామారెడ్డి తహసీల్దార్ తమ సిబ్బందిని మద్దికుంట గ్రామానికి పంపి గల్ఫ్ బాధితుడు ప్రభాకర్ భార్య అనసూయ నుంచి వివరాలు సేకరించారని ఆయన వివరించారు.

నల్లబ్యాడ్జీలతో ఆరోగ్యమిత్రల నిరసన

కామారెడ్డి టౌన్, ఆగస్టు 21: కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆరోగ్యమిత్రలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా వారివారి సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి రెండురోజుల పాటు నిరసన తెలుపనున్నారు. మొదటిరోజు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపినట్లు జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాడర్‌చెంజ్ చేయడంతో పాటు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. జీవో 60 ప్రకారం రూ.22,750 జీతం ప్రకటించాలని కోరారు. ఆరోగ్యశ్రీ బెస్ట్ సీవో హెల్త్ మినిస్టర్ ఎన్నిసార్లు చెప్పినా.. స్పందన లేకపోవడంతో తప్పని పరిస్థితిల్లో నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.

ఎల్లారెడ్డి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్య మిత్రులు బుధవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన తెలుపుతూ విధులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో చాలా సంవత్సరాలుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని విధి నిర్వహణలో మరణిస్తే రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని హెల్త్ కార్డులు ఇవ్వాలని సెట్టింగ్ విధానం రద్దు చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

బదిలీపై వెళ్తున్న పోలీసు అధికారులకు సన్మానం

రాజంపేట, ఆగస్టు 21: రాజంపేటమండల కేంద్రంలోని స్థానిక పోలీసుస్టేషన్ నుండి బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ గంగారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ పండరిగౌడ్‌లను బుధవారం ఎస్ఐ పుష్పరాజ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సంజీవులు, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ బాలయ్య, శ్రీనివాస్, రాజేష్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 21: ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మండలస్థాయి, మున్సిపల్ అధికారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. సర్వే నెంబర్‌లు, ప్లాట్ దరఖాస్తు సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాంభూమి, దేవాదాయ భూమి వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులను అనవసరంగా ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్లాట్ల యాజమానులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా అది ప్రభుత్వ స్థలమా? ప్రైవేట్ స్థలమా? అనేది పక్కగా నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. ఇందులో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, తదితరులున్నారు.

● పోలింగ్ బూత్‌లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ బూత్‌లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల నమోదుపై అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల పేర్లు ఓటర్‌జాబితాలో ఉన్నాయోలేదో నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. ఓటర్‌జాబితాలో ప్రముఖుల ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ,మాజీ జడ్పీచైర్మన్, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్సీ పేర్లుండే విధంగా చూడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీల ప్రతినిధులదని అన్నారు. 2025 జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండిన యువత ఓటర్‌గా నమోదు చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు ఇందిరా ప్రియదర్శిని, అనిల్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, కాసిం, వెంకట్‌గౌడ్, మదన్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు ఆసుపత్రిని సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంఆర్‌హెచ్‌వో

లింగంపేటలో ప్రైవేటు ఆసుపత్రి సీజ్

లింగంపేట, ఆగస్ట్ 21: మండల కేంద్రంలోని రాహుల్ ఆసుపత్రిలో అనుమతి లేకుండా ఆపరేషన్ థియటర్ ఏర్పాటు చేయడంతో బుధవారం జిల్లా డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో(ప్రోగాం అధికారి) ప్రభుకుమార్ ఆసుపత్రిని సీజ్ చేశారు. బీటెక్ విద్యార్థి మృతి చెందిన విషయం పత్రికల్లో రావడంతో వైద్య సిబ్బంది తండాకు వెళ్లి విచారణ జరిపారు. మండలంలోని బాయంపల్లి తండాకు చెందిన బీటెక్ విద్యార్థి చౌహాన్ వీరేందర్‌కు చికిత్సలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు పిర్యాదు చేయడంతో ఆసుపత్రికి వచ్చి ఆసుపత్రిని పరిశీలించి అనుమతి లేకుండా ఆపరేషన్ థీయటర్ ఏర్పాటుతో పాటు ఎంబీబీఎస్ వైద్యుడు హరినారాయణ లేకపోయినా.. అతని పేరిట వైద్య సేవలు అందిస్తున్నట్లు తేలడంతో పాటు ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నట్లు విచారణలో తెలడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిని సీజ్ చేసిన విషయాన్ని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు నివేదించినట్లు తెలిపారు. ఇందులో శీనివాస్, శివ్వయ్య, ఫరీదాబేగం, రమేష్, యాదగిరి ఉన్నారు.

దుర్కిలో తల్లిని చంపిన తనయుడు

నసురుల్లాబాద్, ఆగస్టు 21: మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన మెక్కా సాయికుమార్ తన తల్లి మెక్కా అంజవ్వ(46)ను చంపిన ఘటన బుధవారం దుర్కి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. గత ఏడాది సాయికుమార్ తండ్రి మరణించడంతో బీమా డబ్బులు వచ్చాయి. అవి ఇవ్వాలని తల్లితో నిత్యం సాయికుమార్ గొడవ పడేవాడని, నిన్న మధ్యాహ్నం సైతం ఈ విషయంపై తల్లీకొడుకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుందన్నారు. గతంలోనే అంజవ్వ కొడుకు సాయికుమార్‌కి కొన్ని డబ్బులు ఇవ్వగా.. మరికొన్ని డబ్బులు బ్యాంకులో డిపాజిట్ చేసిందన్నారు. అయితే బ్యాంకులో దాచిన డబ్బులు మళ్లీ అడుగగా.. ఆమె డబ్బులు ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో సాయికుమార్ ఆవేశంలో కర్రతో తల్లి తలపై కొట్టడంతో తల్లి అక్కడిక్కడే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీర్కూర్‌లో మహిళ అదృశ్యం

బీర్కూర్, ఆగస్టు 21: మండల కేంద్రానికి చెందిన పార్థ లక్ష్మి(38) అనే మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన పార్థ లక్ష్మికి సుమారు 20ఏళ్ల క్రితం తాడ్కోల్‌కు చెందిన గంగారాంతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత 8ఏళ్ల క్రితం గంగారాం మృతి చెందడంతో లక్ష్మి బీర్కూర్‌లో తల్లి వద్దకు వచ్చి ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటుంది. ఇదిలా ఉండగా ఈనెల 17న పెన్షన్ కోసమని తాడ్కోల్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వద్ద గాలించారు. ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి - డబుల్ ఇస్మార్ట్
దర్శన్ - మిస్టర్ బచ్చన్
ప్రియా 70ఎంఎం - తంగలన్
ప్రియా 35ఎంఎం - సరకాతి కా అటాంక్

బాన్సువాడ

మహేశ్వరి - మిస్టర్ బచ్చన్
వేంకటేశ్వర - డబుల్ ఇస్మార్ట్



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

